క్లుప్తంగా

నేడు పొన్నాడ ఎన్నికల ప్రచారం ప్రారంభం

కాట్రేనికోన: ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్ కుమార్ మంగళవారం కాట్రేనికోన మావుళ్లమ్మ గుడి సెంటరు నుంచి ఎన్నికల ప్రచారం ప్రారంభించనున్నారని పార్టీ మండల శాఖ కన్వీనర్ నల్లా నరసింహమూర్తి తెలిపారు. అనంతరం బైక్ ర్యాలీ ఉంటుందన్నారు. పార్టీ నాయకులు, అభిమానులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొని ర్యాలీ విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

వైభవంగా సింహ వాహనోత్సవం



సింహ వాహనోత్సవం నిర్వహిస్తున్న పండితులు

యానాం: పట్టణంలో కొలువైన భూసమేత వేంకటేశ్వరస్వామివారి కల్యాణోత్సవాల్లో భాగంగా 8వ రోజు సోమవారం రాత్రి సింహ వాహనోత్సవం వైభవంగా జరిగింది. స్థానిక ఉపాధ్యాయ సంఘం ఉత్సవదారులుగా నిర్వహించిన సింహ వాహనోత్సవంలో ప్రాంతీయ విద్యాశాఖాధికారి పంపన లక్ష్మణ్ ప్రవీణ్ పాల్గొని స్వామివారిని దర్శించుకుని పూజలు చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. అనంతరం పురవీధుల్లో వేంకటేశ్వరస్వామి అధిరోహించిన సింహ వాహనాన్ని ఊరేగించారు.

సేవా దృక్పథం అలవరచుకోవాలి



ఎన్ఎస్ఎస్ వలంటీర్లకు సర్టిఫికెట్లు అందజేస్తున్న ప్రిన్సిపాల్ భాస్కరరెడ్డి

యానాం: ప్రతిఒక్కరూ విద్యార్థి దశ నుంచే సామాజిక సేవా దృక్పథాన్ని అలవరచుకోవాలని, దానికి నేషనల్ సర్వీస్ స్కీమ్(ఎన్ఎస్ఎస్) ఎంతగానో దోహదపడుతుందని ప్రిన్సిపాల్ డాక్టర్ వరుగు భాస్కరరెడ్డి పేర్కొన్నారు. సోమవారం స్థానిక సర్వేపల్లి రాధాకృష్ణన్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎన్ఎస్ఎస్ సేవా శిబిరాల ముగింపు సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ప్రకృతి వైపరీత్యాలు, వివిధ ప్రభుత్వ కార్యక్రమాల్లో సేవలు అందించేలా ఎన్ఎస్ఎస్ వలంటీర్లు కీలకపాత్ర పోషిస్తున్నారన్నారు. అనంతరం ఎన్ఎస్ఎస్-1, 2 యూనిట్ల వలంటీర్లకు సర్టిఫికెట్లను అందజేశారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ విజయ్‌సాగర్, ప్రోగ్రామ్ ఆఫీసర్లు ఎస్.శ్రీనివాస్, సీహెచ్ నరేష్, కోఆర్డినేటర్ సీహెచ్ కృష్ణ సుధాకర్, డి.శాంతికుమార్, అధ్యాపకులు పాల్గొన్నారు.

తమిళిసై రాజీనామాతో వేడెక్కిన రాజకీయాలు

యానాం: పుదుచ్చేరి లెఫ్టినెంట్ గవర్నర్‌గా విధులు నిర్వహించిన తమిళిసై సౌందరరాజన్ సోమవారం తన రాజీనామాను రాష్ట్రపతికి పంపిన నేపథ్యంలో పుదుచ్చేరిలో రాజకీయాలు ఒక్కసారిగా వేడెక్కాయి. గవర్నర్ పదవికి రాజీనామా చేసిన ఆమె పుదుచ్చేరి, తమిళనాడు ప్రాంతాల్లో ఏదో ఒక పార్లమెంట్ స్థానం నుంచి పోటీ చేస్తారన్న చర్చ సాగుతుంది. ముఖ్యంగా పుదుచ్చేరి, తిరునాల్లి, తూత్‌కుడి, కన్యాకుమారి నియోజకవర్గాలను ఆమె పరిశీలిస్తున్నారన్న వార్తలు సామాజిక మాధ్యమాల్లో హల్‌చల్ చేస్తున్నాయి. 2019లో తమిళనాడు బీజేపీ అధ్యక్షురాలిగా పని చేశారు. అప్పట్లో తూతుకూడి నియోజకవర్గం నుంచి పోటీ చేసి డీఎంకే అభ్యర్థి కనిమొలి చేతిలో ఓడిపోయారు. 2021 నుంచి పుదుచ్చేరి ఇన్‌చార్జి ఎల్జీగా పనిచేస్తున్నారు.

బ్యాక్ డోర్ నియామకాలపై విచారించాలి

యానాం: నియోజకవర్గ పరిధిలోని యానాం జీజీహెచ్‌లో తొమ్మిది మందికి దొడ్డి దారిన ఉద్యోగ నియామకాలు ఇవ్వడానికి ప్రయత్నిస్తున్న ఘటనపై విచారణ జరపాలని కోరుతూ పుదుచ్చేరి ఎన్నికల కమిషనర్‌కు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి వినతి పత్రాలు అందించినట్లు విడుతలై చిరుతైగల్ కచ్చి పార్టీ యానాం శాఖ కార్యదర్శి మెల్లం శ్రీనివాసరావు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. నిబంధనలకు విరుద్ధంగా రాజకీయ నాయకుల ఒత్తిడి మేరకు జీజీహెచ్‌లో నియామకాలు చేపడుతున్నారని, తక్షణం దీనిపై విచారణ జరిపించాలని కోరామన్నారు.

అశోక్‌కుమార్ మృతి తీరని లోటు

అమలాపురం రూరల్: హరి మనోవికాస కేంద్రం ద్వారా ఎందరో మానసిక దివ్యాంగులకు సేవలందించిన సల్లాబత్తుల అశోక్‌కుమార్ మృతి తీరని లోటని జిల్లా స్వచ్ఛంద సేవా సంస్థల అధ్యక్షుడు అబ్బిరెడ్డి సురేష్ అన్నారు. సోమవారం జిల్లా దివ్యాంగుల ఐక్య జేఏసీ ఆధ్వర్యంలో సంతాపం సభలో ఆయన మాట్లాడుతూ గత 30 ఏళ్లుగా అశోక్‌కుమార్ అందించిన సేవలు స్ఫూర్తిదాయకమన్నారు. భవిష్యత్తులో హరి మనోవికాస కేంద్రం నిర్వహణలో తమ వంతు సహకారం అందిస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో జేఏసీ చైర్మన్ పెనుమాల నాగరాజు, కొప్పాడి నాగరాజు, జనిపెల్లి సంపత్‌కుమార్, కోసాన సుబ్రహ్మణ్యం, నిమ్మకాయల సురేష్, సుంకర రాజు పాల్గొన్నారు.

ప్రశాంతంగా పది పరీక్షలు

- పరీక్షా కేంద్రాల వద్ద కట్టుదిట్టమైన భద్రత
- పరీక్ష సమయంలో సమీపంలోని జిరాక్స్ సెంటర్ల మూసివేత



గొల్లవిల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలలో పరీక్ష రాసేందుకు వెళ్తున్న విద్యార్థులు



అమలాపురం జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో పరీక్ష రాసి బయటకు వస్తున్న విద్యార్థులు

అమలాపురం టౌన్/అమలాపురం రూరల్/ముమ్మిడివరం/అల్లవరం/తాళ్లరేవు/ఉప్పలగుప్తం/ఐ.పోలవరం /యానాం: పదో తరగతి పరీక్షలు సోమవారం నుంచి ప్రారంభమయ్యాయి. విద్యార్థులు, వారికి తోడుగా వచ్చిన తల్లిదండ్రులతో పరీక్షా కేంద్రాల వద్ద సందడి నెలకొంది. విద్యార్థులు ఉదయం 8.30 గంటలకే కేంద్రాలకు చేరుకుని తమ హాల్ టికెట్ నెంబర్ల ఆధారంగా పరీక్ష గదులకు చేరుకున్నారు. పరీక్షా కేంద్రాల్లో బెంచీలు, విద్యుత్, ఫ్యాన్లు, తాగునీరు వంటి మౌలిక సదుపాయాలు ఉండేలా అధికారులు ముందస్తుగానే జాగ్రత్తలు తీసుకోవడంతో విద్యార్థులు ప్రశాంతంగా పరీక్ష రాశారు. ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.45 గంటల వరకూ పరీక్ష జరిగింది. పరీక్షా కేంద్రాల వద్ద ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా కట్టుదిట్టమైన పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. పరీక్షల సమయంలో ఆయా కేంద్రాల సమీపంలోని జిరాక్స్ సెంటర్లను అధికారులు మూయించి వేశారు.

- అమలాపురం పట్టణం, రూరల్ మండలంలో మొత్తం 11 పరీక్షా కేంద్రాల్లో 2,149 మంది విద్యార్థులు పరీక్ష రాయాల్సి ఉండగా 2,118 మంది హాజరయ్యారు. మరో 31 మంది గైర్హాజరయ్యారు. స్క్వాడ్ అధికారి, అమలాపురం ఎంఈవో గుబ్బల సూర్యప్రకాశం పలు పరీక్షా కేంద్రాలను తనిఖీ చేశారు. అమలాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సీహెచ్ చంద్రశేఖర్ అనే అంధ విద్యార్థి తరపున అతడి సమక్షంలో 9వ తరగతి చదువుతున్న రాయుడు విజయ శ్రీశ్యామల పరీక్ష రాసింది.
- అల్లవరం మండలంలోని అల్లవరం 1, 2, కొమరగిరిపట్నం, దేవగుప్తం ఉన్నత పాఠశాలల్లో ఏర్పాటుచేసిన నాలుగ పరీక్షా కేంద్రాల్లో 622 మంది విద్యార్థులు పరీక్ష రాశారు. తొలి రోజు 31 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. విద్యార్థులను క్షుణ్ణంగా తనిఖీ చేసిన తరువాతే పరీక్ష రాసేందుకు అనుమతించారు.
- ముమ్మిడివరం మండలంలోని ముమ్మిడివరం జెడ్పీ బాలుర, ఉన్నత పాఠశాల, బాలికల ఉన్నత పాఠశాల, అయినాపురం, అనాతవరం ప్రభుత్వ పాఠశాల, ముమ్మిడివరం గురుకుల పాఠశాలలోని పరీక్షా కేంద్రాల్లో 722 మంది విద్యార్థులు పరీక్ష రాయగా మరో 11 మంది గైర్హాజరయ్యారు.
- తాళ్లరేవు మండలంలోని ఐదు పరీక్షా కేంద్రాల్లో కలిపి 1068 మంది విద్యార్థులు తొలి రోజు జరిగిన తెలుగు పరీక్ష రాశారు. మరో 50 మంది పరీక్షకు గైర్హాజరయ్యారని విద్యాశాఖాధికారులు తెలిపారు.
- ఉప్పలగుప్తం మండలంలో భీమనపల్లి, గొల్లవిల్లి, చల్లపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలల్లో 617 మంది పరీక్షకు హాజరు కావాల్సి ఉండగా 606 మంది పరీక్షకు హాజరయ్యారు. 11 మంది విద్యార్థులు పరీక్షకు గైర్హాజరయ్యారని ఎంఈవో-2 సత్తి సత్యకృష్ణ తెలిపారు.
- ఐ.పోలవరం మండలంలోని నాలుగు పరీక్షా కేంద్రాల్లో 705 మంది విద్యార్థులు పరీక్ష రాయవలసి ఉండగా 702 మంది హాజరయ్యారని ఎంఈఓ-1 కె.తిరుమలరావు, ఎంఈఓ-2 ఎస్.కొండారెడ్డిలు తెలిపారు.
- యానాం నియోజకవర్గంలోని కనకాలపేటలో కామిశెట్టి పరశురామ వరప్రసాదరావు నాయుడు ప్రభుత్వ హైస్కూల్, మహాత్మాగాంధీ ప్రభుత్వ బాలుర హైస్కూల్, మెట్టకూరు ప్రభుత్వ హైస్కూళ్లలో ఏర్పాటుచేసిన పరీక్షా కేంద్రాల్లో మొదటిరోజు పరీక్షకు 617 మంది హాజరయ్యారని, ముగ్గురు గైర్హాజరయ్యారని ప్రాంతీయ విద్యాశాఖాధికారి పి.లక్ష్మణ్‌ప్రవీణ్ తెలిపారు.



దేవగుప్తంలోని పరీక్షా కేంద్రంలోకి వెళ్తున్న విద్యార్థులు



ముమ్మిడివరంలో పరీక్షా కేంద్రం వద్ద నిరీక్షిస్తున్న విద్యార్థులు



తాళ్లరేవు జూనియర్ కళాశాల కేంద్రంలోకి వెళుతున్న విద్యార్థులు



కొంకాపల్లిలో పరీక్ష రాసి బయటకు వస్తున్న విద్యార్థులు

రాపాక, గొల్లపల్లిలకు అభినందన



రాపాక వరప్రసాదరావును అభినందిస్తున్న ఎమ్మెల్సీ సూర్యనారాయణరావు తదితరులు

అమలాపురం టౌన్: అమలాపురం పార్లమెంట్ నియోజకవర్గం, రాజోలు అసెంబ్లీ నియోజకవర్గం వైఎస్సార్ సీపీ అభ్యర్థులు రాపాక వరప్రసాదరావు, గొల్లపల్లి సూర్యారావులను ఎమ్మెల్సీ కుడుపూడి సూర్యనారాయణరావు సోమవారం వేర్వేరుగా కలిసి అభినందించారు. రాపాక, గొల్లపల్లి ఈ ఎన్నికల్లో విజయ దుందుభి మోగిస్తారని, ముఖ్యమంత్రి జగన్ అమలు చేస్తున్న ప్రజా సంక్షేమ పథకాలే వారిని గెలిపిస్తాయని ఆయన ధీమా వ్యక్తం చేశారు. ఎమ్మెల్సీ కుడుపూడి వెంట వైఎస్సార్ సీపీ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు మట్టపర్తి నాగేంద్ర, ముంగర ప్రసాద్ ఉన్నారు.

ఘనంగా రుద్ర హోమం

ఐ.పోలవరం: ప్రముఖ పుణ్యక్షేత్రం మురమళ్ల శ్రీభద్రకాళీ సమేత వీరేశ్వరస్వామి ఆలయంలో రుద్ర హోమం ఘనంగా జరిగింది. పరమ శివుని జన్మనక్షత్రం ఆరుద్ర నక్షత్రంను పురస్కరించుకుని ఆలయంలో సోమవారం ఆలయ అర్చకస్వామి పేటేటి శ్యామలకుమార్ ఆధ్వర్యంలో నాగాభట్ల రామకృష్ణమూర్తి తదితరులు స్వామివారికి గణపతి పూజ, పుణ్యాహవచనం, రుద్రహోమం నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు తరలి వచ్చిన స్వామిని దర్శించుకున్నారు.

ఉచిత కంటి వైద్య శిబిరం

కొత్తపేట: స్థానిక తాలూకా ప్రభుత్వ పెన్షనర్ల సంఘ భవనంలో సోమవారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. పెన్షనర్ల సంఘం ఆధ్వర్యంలో రాజమహేంద్రవరం అకీరా నేత్ర వైద్యశాల వారి సౌజన్యంతో నిర్వహించిన ఈ శిబిరంలో కంటి వైద్య నిపుణులు డాక్టర్ వి.ప్రభుసాయి సుమారు 50 మందికి కంటి పరీక్షలు నిర్వహించి 14 మందికి శుక్లాల ఆపరేషన్లు చేయవలసి ఉందని గుర్తించారు. ఆరుగురి కళ్లద్దాలు మార్చుకోవాలని సూచించారు.

ప్రారంభమైన ఎన్నికల కోలాహలం

- వైఎస్సార్ సీపీ శ్రేణుల్లో నూతనోత్సాహం
- నేడు ఎన్నికల ప్రచారానికి శ్రీకారం చుట్టనున్న పొన్నాడ



ముమ్మిడివరం అసెంబ్లీ అభ్యర్థి పొన్నాడను అభినందిస్తున్న పార్టీ శ్రేణులు

ముమ్మిడివరం: ముమ్మిడివరం నియోజకవర్గ వైఎస్సార్ సీపీ అభ్యర్థి, ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్ నేడు కాట్రేనికోన మండలంలోని మావుళ్లమ్మ గుడి వద్ద అమ్మవారిని దర్శించుకుని ఎన్నికల ప్రచారానికి శ్రీకారం చుట్టనున్నారు. ఉదయం 10.09 గంటలకు ఎన్నికల ప్రచారం ప్రారంభించి అక్కడి నుంచి మోటారు బైక్‌లతో ర్యాలీగా బయలుదేరి చెయ్యేరు, సీహెచ్ గున్నేపల్లి, మహిపాల చెరువు మీదుగా ముమ్మిడివరం ఎయిమ్స్ కళాశాల వరకూ ప్రచారం నిర్వహిస్తారు.

కార్యకర్తల్లో మరింత జోష్

ఆధ్యాత్మిక కేంద్రంగా విరాజిల్లుతున్న ముమ్మిడివరం నియోజకవర్గంలో సుమారు 2.41 లక్షల మంది ఓటర్లున్నారు. ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్ గత ఐదేళ్లలో నియోజకవర్గంలో సుమారు రూ.22 కోట్ల నిధులతో వివిధ అభివృద్ధి, సంక్షేమ పథకాలు అందించారు. అలాగే గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం ద్వారా నియోజకవర్గంలో ఇంటింటికీ వెళ్లి నవరత్న పథకాల ద్వారా ఆయా కుటుంబాలకు కలిగిన లబ్ధిని వివరించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాల లబ్ధి, జరుగుతున్న అభివృద్ధి కారణంగా ఇంటింటా పొన్నాడకు అపూర్వ స్వాగతం లభించింది. ఇటీవల ముమ్మిడివరంలో నిర్వహించిన మత్స్యకార సభ, వైఎస్సార్ చేయూత సభలు సైతం సూపర్ సక్సెస్ కావడంతో వైఎస్సార్ సీపీ కార్యకర్తలు మంచి జోష్ మీద ఉన్నారు. పొన్నాడ వెంకట సతీష్‌కుమార్‌ను తిరిగి అత్యధిక మెజార్టీతో గెలిపించుకోవాలని ఉవ్విళ్లూరుతున్నారు. నూతనోత్సాహంతో ఎన్నికలకు సర్వసన్నద్ధమవుతున్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముమ్మిడివరం అసెంబ్లీ నియోజకవర్గానికి పొన్నాడ అభ్యర్థిత్వాన్ని ఖరారు చేయడంతో గ్రామ, మండల స్థాయి నేతలు వచ్చి ఎమ్మెల్యే పొన్నాడను కలిసి శుభాకాంక్షలు తెలియజేస్తున్నారు.

ఎన్నికలపై చర్చోపచర్చలు

ఎన్నికల షెడ్యూల్ విడుదల కావడంతో పట్టణాలు, పల్లెల్లో ఎన్నికల కోలాహలం ప్రారంభమైంది. గ్రామాల్లో రచ్చ బండల వద్ద, కూడళ్లలోనూ ఎన్నికల్లో ప్రధాన రాజకీయ పార్టీల నుంచి పోటీ చేసే అభ్యర్థుల బలాబలాలపై చర్చోపచర్చలు జరుగుతున్నాయి. గత ఎన్నికల్లో ఎదురైన అనుభవాలు, ప్రస్తుత రాజకీయ పార్టీల పరిస్థితిని అంచనా వేసే పనిలో నిమగ్నమయ్యారు.

మంత్రి విశ్వరూప్‌ను భారీ మెజార్టీతో గెలిపిస్తాం



మంత్రి విశ్వరూప్‌ను సత్కరిస్తున్న దళిత జేఏసీ నాయకులు



మంత్రి విశ్వరూప్‌ను అభినందిస్తున్న వైశ్య నాయకులు

అమలాపురం రూరల్: రాష్ట్ర రవాణా శాఖ మంత్రి విశ్వరూప్‌ను అమలాపురం నియోజకవర్గ ఎమ్మెల్యేగా భారీ మెజారిటీతో గెలిపిస్తామని ఆర్య వైశ్య సంఘం, కోనసీమ దళిత ఐక్యవేదిక నాయకులు అన్నారు. పినిపే విశ్వరూప్‌ను అమలాపురం నియోజకవర్గ వైఎస్సార్ సీపీ అభ్యర్థిగా ప్రకటించిన నేపథ్యంలో నియోజకవర్గ నేతలు, పార్టీ కార్యకర్తలు, వివిధ సంఘాల ప్రతినిధులు ఆయనను కలిసి శుభాకాంక్షలు తెలుపుతున్నారు. సోమవారం పట్టణ వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు సంసాని నాని, మున్సిపల్ వైస్ చైర్మన్ రుద్రరాజు నాని రాజుల ఆధ్వర్యంలో వైశ్య నాయకులు మంత్రి విశ్వరూప్‌ను కలిసి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అందిస్తున్న సంక్షేమ పథకాలే వైఎస్సార్ సీపీకి శ్రీరామరక్ష అన్నారు. అమలాపురం సీటును గెలిపించి సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి గిఫ్టుగా అందిస్తామన్నారు. అనంతరం మంత్రి విశ్వరూప్‌ను దుశ్శాలువా, పూలమాలలతో సత్కరించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ రాష్ట్ర వాణిజ్య విభాగం కార్యదర్శి నూలు రమేష్, మున్సిపల్ కోఆప్షన్ సభ్యులు వంకాయల కాశీ, సింగం శెట్టి ప్రసాద్, నూలు కృష్ణ, కంచర్ల స్వామి అయ్యప్ప, పసుమర్తి రాము, జంగా బాబురావు, మెండు రమేష్ బాబు, నాగాబత్తుల ప్రసాదరావు, కోట రామ్మోహన్‌రావు, పులిదిండి సత్యనారాయణ, ఉబ్బన శ్రీనివాసరావు, మెండు సురేష్‌బాబు, పమ్మి తాతాజీ తదితరులు పాల్గొన్నారు.

జనసేన నుంచి వైఎస్సార్ సీపీలో చేరిక




వైఎస్సార్ సీపీలో చేరిన యువకులు, చిత్రంలో జెడ్పీటీసీ సభ్యుడు సతీష్‌రాజు

ఐ.పోలవరం: మండలంలోని టి.కొత్తపల్లి అడవిపేటకు చెందిన జనసేన పార్టీకి చెందిన పలువురు యువకులు సోమవారం వైఎస్సార్ సీపీలో చేరారు. జెడ్పీటీసీ సభ్యుడు ముదునూరి సతీష్‌రాజు, టి.కొత్తపల్లి సొసైటీ అధ్యక్షుడు వడ్డి గౌతం తదితరులు కండువాలు కప్పి వారిని పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. వైఎస్సార్ సీపీ సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనులు నచ్చి తాము పార్టీలో చేరినట్లు సదరు యువకులు తెలిపారు.

ఆక్వా చెరువు వద్ద పాక దగ్ధం

అల్లవరం: మండలంలోని కోడూరుపాడు దేశికోడు వంతెన వద్ద ఆక్వా సాగు చేస్తున్న కొత్తపల్లి జగన్నాథరాజుకు చెందిన పాక ఆదివారం రాత్రి దగ్ధమైంది. ఈ ప్రమాదంలో మంటలు వ్యాపించి ఒక మోటారుసైకిల్ పూర్తిగా కాలిపోయింది. విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా అగ్ని ప్రమాదం సంభవించిందని స్థానికులు తెలిపారు.

కిడ్నీ బాధిత చిన్నారికి ఆర్థిక సాయం



పాపకు సాయం అందజేస్తున్న కాశీ అన్నపూర్ణాదేవి సేవా సంస్థ సభ్యులు

రావులపాలెం: కిడ్నీ వ్యాధితో బాధపడుతున్న చిన్నారికి స్థానిక కాశీ అన్నపూర్ణాదేవి సేవా సమితి సభ్యులు రూ.23 వేల ఆర్థిక సాయం అందజేసినట్టు సభ్యులు సోమవారం తెలిపారు. మండలంలోని గోపాలపురం గ్రామానికి చెందిన పాలూరి మీనాక్షి నాగశేషరత్నం (3) కిడ్నీకి సంబంధించిన వ్యాధితో బాధపడుతుంది. ఈ పాప తండ్రి చనిపోయారు. తల్లి చాలా ఇబ్బందులు పడుతూ వైద్యం చేయిస్తున్నారు. వైద్యానికి చాలా ఖర్చు అవుతుండటంతో అంత స్తోమత లేకపోవడంతో కాశీ అన్నపూర్ణ దేవి సేవా సంస్థను సహాయం కోరారు. దీంతో పాప ఇంటికి వెళ్లి సంస్థ సభ్యుల చేతుల మీదుగా రూ.23 వేల నగదు సాయాన్ని అందజేసినట్టు తెలిపారు.

బాపట్ల ఎంపీ అభ్యర్థిగా సురేష్ ఎంపికపై హర్షం



బాపట్ల ఎంపీ అభ్యర్థి సురేష్ దంపతులను గజమాలతో సత్కరిస్తున్న ఇజ్రాయిల్ దంపతులు

అల్లవరం: బాపట్ల ఎంపీ అభ్యర్థిగా నందిగం సురేష్‌ని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎంపిక చేయడంపై ఎమ్మెల్సీ బొమ్మి ఇజ్రాయిల్ హర్షం వ్యక్తం చేశారు. బాపట్ల ఎంపీ అభ్యర్థిగా ఎంపికైన నందిగం సురేష్ దంపతులను ఎమ్మెల్సీ ఇజ్రాయిల్ దంపతులు సోమవారం ఆయన నివాసంలో మర్యాద పూర్వకంగా కలిసి గజమాలతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. 175 అసెంబ్లీ స్థానాలు, 25 పార్లమెంట్ స్థానాలు వైఎస్సార్ సీపీ కైవసం చేసుకుంటుందని, వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రెండోసారి ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేస్తారని ఇజ్రాయిల్ అన్నారు. ఎంపీ అభ్యర్థి సురేష్ భారీ మెజారిటీతో గెలిచి బాపట్ల ఎంపీ సీటును సీఎం జగన్‌కు బహుమతిగా ఇవ్వాలని కోరారు. వారి వెంట బడుగు శ్రీను, చేట్ల సత్యనారాయణ, లంక ఏడుకొండలు, పెట్ల సత్యనారాయణ, నవుండ్రు రమేష్, జొన్నాడ అజయ్, పెదపూడి మణికంఠ, ఉందుర్తి ప్రసాద్, సవరపు కన్నబాబు పాల్గొన్నారు.

ఓటు హక్కుపై అవగాహన కల్పించాలి



సమావేశంలో మాట్లాడుతున్న సమగ్ర శిక్షా అదనపు ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ మధుసూదనరావు

అమలాపురం రూరల్: రానున్న సార్వత్రిక ఎన్నికల్లో యువత పెద్ద ఎత్తున ఓటు హక్కును వినియోగించుకునేలా అవగాహన కల్పిస్తూ గ్రామాల్లో పతంగులు, రంగోలి, ట్రైసైకిల్ పోటీలు నిర్వహించాలని సమగ్ర శిక్షా అదనపు ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ మధుసూదనరావు అన్నారు. కలెక్టర్ ఆదేశాల మేరకు మండల విద్యా శాఖ కార్యాలయంలో ఎంఈఓలు జి.సూర్య ప్రకాశం, దుర్గాదేవి అధ్యక్షతన సోమవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. తప్పనిసరిగా ఓటు వేసేలా యువ ఓటర్లను చైతన్యపరచాలన్నారు. దీంట్లో భాగంగా బుధవారం పతంగుల పండగ, గురువారం రంగోలి పండగ, శుక్రవారం ట్రై సైకిల్ పోటీలు నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో సమగ్ర శిక్షా సీఎంఓ బీవీవీ సుబ్రహ్మణ్యం, ఏపీఓ ఎంఏకే భీమారావు తదితరులు పాల్గొన్నారు.

ఫ్లయింగ్ స్క్వాడ్ అప్రమత్తంగా ఉండాలి



ఫ్లయింగ్ స్క్వాడ్ సిబ్బందికి సూచనలిస్తున్న ఆర్డీఓ కేశవ వర్ధన్‌రెడ్డి

అల్లవరం: సార్వత్రిక ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చిన నేపథ్యంలో ఫ్లయింగ్ స్క్వాడ్ అప్రమత్తంగా ఉండాలని ఆర్డీఓ కేశవ వర్ధన్‌రెడ్డి అన్నారు. సోమవారం ఆయన అల్లవరం మండలం కోడూరుపాడు వంతెన వద్ద ఫ్లయింగ్ స్క్వాడ్ సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నంత కాలం ఫ్లయింగ్ స్క్వాడ్ సిబ్బంది మూడు షిఫ్టుల్లో విధులు నిర్వహించాల్సి ఉంటుందన్నారు. చెక్ పోస్టులు దాటుకుని రాకపోకలు సాగిస్తున్న వాహనాల్లో ఎలాంటి ఆధారాలు లేకుండా మద్యం, రూ.50 వేలకు మించి నగదు తరలిస్తే వారిని అదుపులోకి తీసుకోవాలన్నారు. గ్రామాల్లో నగదు, మద్యం పంపిణీ చేస్తున్నారని ఈ-విజిల్ యాప్ ద్వారా సమాచారం వస్తే ఫ్లయింగ్ స్క్వాడ్ వేగంగా స్పందించి అలాంటి వారిని అదుపులోకి తీసుకోవాలన్నారు. ఎన్నికల్లో నగదు, మద్యం ప్రవాహాన్ని అడ్డుకోవాల్సిన బాధ్యత స్క్వాడ్‌పై ఉందన్నారు. ఆర్డీఓ వెంట తహసీల్దార్ సునీల్‌కుమార్, ఎంఈఓ-2 ఏడుకొండలు, ఆర్ఐ దుర్గాశ్రీను, వీఆర్‌ఓలు చిట్టిబాబు, రత్నరాజు, నాగేంద్ర, నాయుడు తదితరులున్నారు.

వాహనాల తనిఖీ

అంబాజీపేట: సార్వత్రిక ఎన్నికలను పురస్కరించుకుని అంబాజీపేట మండలంలో ప్రధాన రహదారిపై వెళుతున్న వాహనాలను పోలీసులు సోమవారం తనిఖీ చేశారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఎస్సై కె.చిరంజీవి పర్యవేక్షణలో పోలీస్ సిబ్బంది వాహనాలను తనిఖీ చేస్తున్నారు. ఎన్నికల నియామవళిని ప్రతి ఒక్కరూ పాటించాలని లేని పక్షంలో చర్యలు తప్పవన్నారు. అక్రమంగా మద్యం తరలించినా, ఎటువంటి ఆధారాలు లేకుండా నగదును తరలిస్తున్నా కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

చింతనలంకలో..

అయినవిల్లి: మండలంలోని పలు గ్రామాల్లో సీఐ ప్రశాంత్‌కుమార్ ఆధ్వర్యంలో సీఐఎస్ఎస్ బృందాలతో వాహనాల తనిఖీ జోరుగా నిర్వహిస్తున్నారు. సోమవారం చింతనలంకలో సీఐ, ఎస్సై బి.రాజేష్ కుమార్ బృందాలుగా ఏర్పడి ఎన్నికల సందర్భంగా మద్యం, నగదు డంప్ కాకుండా ఎన్నికల అధికారులు ఆదేశాల మేరకు వాహనాల తనిఖీ నిర్వహిస్తున్నామన్నారు. ముఖ్యమైన కూడలిలో బీటు వేసి అనుమానం వచ్చిన వాహనాలు ఆపి వాటిని క్షుణ్ణంగా తనిఖీ చేస్తున్నారు. వీటికి సంబంధించిన బిల్లులను పరిశీలిస్తున్నారు.

ఆరు ఇసుక, బొండుమట్టి లారీల సీజ్

అయినవిల్లి: రావులపాలెం నుంచి అయినవిల్లి మండలం మీదుగా ముమ్మిడివరం వెళ్తున్న మూడు ఇసుక, మూడు బొండు మట్టి లారీలను సీఐ ప్రశాంత్‌కుమార్ ఆధ్వర్యంలో ఎస్సై బి.రాజేష్‌కుమార్ తన సిబ్బందితో పట్టుకుని సీజ్ చేశారు. ఇసుక, బొండు మట్టికి సంబంధించి ఏ విధమైన రశీదులు చూపించకపోవడంతో వీటిని తదుపరి చర్యలు కోసం సీజ్ చేసి అయినవిల్లి తహసీల్దార్ కార్యాలయానికి అప్పగించినట్లు ఎస్సై తెలిపారు.

యువకుడి మృతి

ఆత్రేయపురం: మండలంలోని నార్కెడ్‌మిల్లి గ్రామానికి చెందిన నల్లి శ్రీకాంత్ (23) పురుగుమందు తాగి మృతి చెందినట్లు రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆసుపత్రి నుంచి వచ్చిన సమాచారం మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై శ్రీనివాస్ తెలిపారు. యువకుడు బీటెక్ పూర్తి చేశాడు. ఈనెల 17న పురుగులమందు తాగాడు. దీంతో రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ సోమవారం చికిత్స పొందుతూ మృతి చెందినట్లు వచ్చిన సమాచారం మేరకు కేసు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

రెండు బైకుల ఢీ

మామిడికుదురు: పాశర్లపూడి-బోడసకుర్రు గ్రామాల మధ్యలోని వైనతేయ గోదావరి నదిపై నిర్మించిన వారధిపై సోమవారం రెండు బైకులు ఢీకొన్న సంఘటనలో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. పి.గన్నవరం మండలం నాగుల్లంకకు చెందిన రెడ్డి వీర వెంకటసత్యనారాయణ, గౌరీ పార్వతి దంపతులు అమలాపురం నుంచి బైకుపై వస్తుండగా, పాశర్లపూడి నుంచి మరో బైకుపై వెళ్తున్న అల్లవరం మండలం బోడసకుర్రుకు చెందిన మొగలి రవి ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో రెడ్డి గౌరీ పార్వతి, మొగలి రవి తీవ్రంగా గాయపడ్డారు. వారిని మొదట అమలాపురం ఏరియా ఆస్పత్రికి, అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం కాకినాడ జీజీహెచ్‌కు తరలించారు. దీనిపై నగరం పోలీసులకు ఆస్పత్రి వర్గాలు సమాచారం అందించారు. ఎస్సై పి.సురేష్ ఈ ప్రమాదంపై విచారణ చేపట్టారు.

అభివృద్ధి పనులు త్వరితగతిన పూర్తి చేయాలి



ఉత్సవాలపై సమీక్ష నిర్వహిస్తున్న ఆర్డీవో జీవీవీ

ఆలమూరు: ఏప్రిల్ ఏడు నుంచి నెల రోజుల పాటు నిర్వహించే సూకాంబిక అమ్మవారి జాతర, తీర్థ మహోత్సవాల దృష్ట్యా ఆలయ అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేసే విధంగా దేవదాయశాఖను ఆర్డీవో జీవీవీ కోరారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం లేకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని విజ్ఞప్తి చేశారు. లక్షలాది మంది భక్తులు వచ్చి అమ్మవారిని దర్శించుకునే అవకాశం ఉన్నందున అధికారులందరూ సమన్వయంతో పని చేయాలన్నారు. డీఎల్‌పీఓ రాజేశ్వరరావు, ఎంపీడీఓ ఎ.మేరీ రోజ్, ఐఎం రామ్‌కుమార్, ఎస్సై ఎల్.శ్రీను నాయక్, జేఏ డి.భాస్కర శ్రీనివాస్, వైద్యాధికారి పి.భవానీశంకర్ తదితరులు పాల్గొన్నారు.